క్లుప్తంగా

31న అట్లతద్ది వేడుకలు

నాగాయలంక: నాగాయలంకలో అట్లతద్ది వేడుకలు ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని బీసీ నేత, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్కాలర్స్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఉదయం 8 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, సాయంత్రం వరకు అట్లతద్ది ఆటపాటలు, ప్రత్యేక ఊయలల ఏర్పాటుతో సంప్రదాయాలను గుర్తు చేస్తూ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే వేడుకల్లో అధిక సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పంట కాలువలోకి డ్రైయినేజీ నుంచి ఉప్పునీరు

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లి సెంట్రల్ చానల్ పరిధిలోని 3ఏ బ్రాంచి కాలువలోకి ఉప్పునీరు ప్రవేశిస్తున్నందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఉప్పుకాలువ డ్రెయినేజీ నుంచి సముద్రపు నీరు బ్రాంచి కాలువలోకి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వర్షాభావ పరిస్థితులతో సాగనీరు సక్రమంగా పొలాలకు చేరక ఇబ్బందులు పడుతున్నారని, ఈతరుణంలో ఉప్పునీరు పొలాల్లోకి ప్రవేశిస్తే రైతులు నిండా మునిగిపోతారని పేర్కొన్నారు. డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో తక్షణం ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.

వరి పొలాలకు జీవం పోసిన వర్షం

కోడూరు: కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో శనివారం కురిసిన ఓ మోస్తారు వర్షం వరి పొలాలకు జీవం పోసింది. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు మండలంలోని పలు ప్రాంతాల్లో సుమారు రెండున్నర గంటల పాటు వర్షం కురిసింది. వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండటంతో వర్షం పంటకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు ఇచ్చిన నిధులతో పెదకళ్లేపల్లిలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. స్థానిక నాంచారమ్మ అమ్మవారి ఆలయం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు రూ. 10 లక్షలతో సుమారు 180 మీటర్ల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు పూర్తయితే 2,3,4 వార్డు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని పాలక వర్గ సభ్యురాలు అరజా వీరకుమారి తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, తోట కృష్ణాంజనేయులు, కొండేటి రమేష్, చెన్నకేవుల నాని, గోళ్ల పూర్ణమల్లికార్జునరావు, అరజా సుబ్బయ్య, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

1.95 లక్షల గోనె సంచులు సిద్ధం

చల్లపల్లి: ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లకు లక్షా 95 వేల గోనె సంచులు సిద్ధం చేశామని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ఆరు రైస్ మిల్లుల్లో గోనెసంచులను సిద్ధం చేశామని తెలిపారు. గత ఏడాది ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా శ్రద్ధ వహిస్తామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తామని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలు ప్రస్తావించగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, ఈఓఆర్డీ అశోక్, అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- అధికారులు, రైతుల సమన్వయంతో ముందుకు సాగాలి
- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: తీవ్ర వర్షాభావ పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి కొరత వల్ల సాగునీటి ఇబ్బందులు తలెత్తాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు, రైతులను సమన్వయ పరుస్తూ ముందుకెళుతున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్‌లో శనివారం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సాధారణంగా 60 శాతం పంట కాలువలు, 40 శాతం వర్షాలపై ఆధారపడి వ్యవసాయ సాగు జరుగుతోందన్నారు. వర్షాలు లేకపోవడం వల్ల పూర్తిగా పంట కాలువ నీటిపై ఆధారపడి సాగుచేయడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అధికారులు, రైతులను సమన్వయ పరుస్తూ సాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. అవనిగడ్డలో ప్రస్తుతం ఉర్దూ స్కూల్‌లో ఒకటి, రెండు తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారని, ఐదు తరగతుల వరకూ ఉండేలా చూడాలని మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా కోరారు. ఎంఈఓ ఎస్. శివశంకరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు ఎక్కువగా ఉండేలా చూస్తే వేరే ఉపాధ్యాయుడిని పంపించి ఐదు తరగతుల వరకు నిర్వహించేలా చూస్తామన్నారు. తిప్పపాలెంలో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని గత మూడు సమావేశాల నుంచి హామీ ఇస్తున్నా పనులు జరగడం లేదన్నారు.

చెత్తబుట్టల పంపిణీ..

తొలుత మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు మంజూరైన తడి చెత్త, పొడి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, ఈఓపీఆర్డీ శైలజ, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

పేర్ని కిట్టు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 11వ డివిజన్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలతో గత నాలుగున్నరేళ్లలో పేదల కుటుంబాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాల వారు ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతమయ్యారన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తుండటంతో పేద వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ 11వ డివిజన్ ఇన్‌చార్జి గూడవల్లి నాగరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకు నిధులతో కాలనీల అభివృద్ధి

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో నగరంలోని పలు కాలనీల అభివృద్ధి జరుగుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 19వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులను శనివారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని పలు డివిజన్లలో మిగిలిపోయిన పనులను గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేస్తున్నామన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. 19వ డివిజన్‌లో ఎప్పటి నుంచో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ పిన్ని శామ్యూల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి బూరగ రామారావు, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ గాదెల్లి డేవిడ్‌శామ్యూల్, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్ నోబుల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

మేయర్ వెంకటేశ్వరమ్మ



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం 23వ డివిజన్ ఉల్లింగిపాలెం ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో జరిగింది. శిబిరాన్ని మేయర్ వెంకటేశ్వరమ్మ ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తూ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. దీనిలో భాగంగా ఆస్పత్రులను నాడు – నేడు పథకం ద్వారా అభివృద్ధి చేయడం, వైద్యులను, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించడం, ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు వంటివి చేశారన్నారు. పేదల ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతోనే ఆరోగ్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను పరిశీలించుకోవాలి



మాట్లాడుతున్న కె.రాజ్యలక్ష్మి, పక్కన ఆర్డీఓ వాణి

పెడన: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉందో, లేదో స్వయంగా ఓటరు జాబితాలను పరిశీలించి చూసుకోవాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజలక్ష్మి అన్నారు. పెడన తహసీల్దార్ కార్యాలయంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మచిలీపట్నం ఆర్డీఓ ఎం. వాణితో కలిసి విలేకరులతో ఆమె మాట్లాడారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక ఓటరు శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఈ శిబిరం ఉంటుందని చెప్పారు. పని దినాలలో తహసీల్దార్ కార్యాలయాల్లోని ఎన్నికల విభాగంలో కూడా కొత్తగా ఓటరుగా అర్హత ఉండి చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఒక కుటుంబంలోని వారంతా వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఉన్న వారు కూడా ఫారం –8 ద్వారా ఒకే పోలింగ్ స్టేషన్‌కు మార్పు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అంశాలపైనే రాజకీయ నాయకులకు దిశానిర్దేశం చేశామన్నారు. ఓటరు జాబితాలు రాజకీయ పార్టీల వారికి ఇవ్వడంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలోను, పోలింగ్ కేంద్రాల్లో కూడా ఉంచామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, బండారు మల్లి, టీడీపీ నాయకులు శలపాటి ప్రసాద్, జనసేన, బీజేపీ నాయకులు, నాలుగు మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు స్వీకరించండి

గూడూరు: ఓటరు ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలని పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.విజయలక్ష్మి బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే బూత్ స్థాయిలో ప్రచురించిన ఓటరు జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. తద్వారా జాబితాలో పేర్లు తప్పులు పడిన వారు, నమోదు కాని వారు ఉంటే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. కొత్తగా ఓటు హక్కు కోసం వచ్చే దరఖాస్తులు, ఇప్పటికే జాబితాలో నమోదైన వాటిపై వచ్చే అభ్యంతరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో బందరు ఆర్డీఓ ఎం.వాణి, గూడూరు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.జ్ఞాన రాజసాయి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పంటకాలువ పూడికతీత



పూడికతీత చేపట్టడంతో దిగువకు వెళ్తున్న సాగునీరు

కోడూరు: వరిపంటకు అవసరమైన సాగునీటిని పొలాల్లోకి మళ్లించేందుకు రైతులు స్వచ్ఛందంగా కాలువ పూడికతీత పనులు నిర్వహించారు. మండలంలోని మందపాకల రెండో నంబర్ పంటకాలువ పరిధిలో సుమారు 100 ఎకరాల పంట భూమి సాగు చేస్తుండగా కాలువలో తూడు, గుర్రపు డెక్క పెరిగిపోవడంతో సాగునీరు దిగువకు వెళ్లడం లేదు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండటంతో నీరు అందక పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో రైతులు కాలువ పూడికతీత చేపట్టేందుకు నడుం బిగించారు. 100 ఎకరాలకు సంబంధించిన రైతులు ఒక్కొక్క ఎకరానికి రూ.400 చొప్పున రూ.40 వేలతో పూడికతీత పనులు నిర్వహించారు. కాలువలో ఉన్న తూడు, చెత్తాచెదారం, వ్యర్థాలను యంత్రాల సహాయంతో తొలగించారు. కాలువ కింది భాగం లెవల్ చేసి నీరు దిగువకు వెళ్లేలా పనులు నిర్వహించారు. ప్రస్తుతం సాగునీరు దిగువకు కూడా వెళ్తున్నాయని కాలువ ఆయకట్టు రైతులు తెలిపారు.

వాల్మీకి మహర్షి జయంతి

పెడన: వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం పెడన పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం ఉదయం నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ మహేంద్ర, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశం

మోపిదేవి: రేషన్ సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ నందిగం మేరీరాణి అన్నారు. మోపిదేవిలో రేషన్‌షాపు–1 వద్ద శనివారం విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటా రేషన్ సరుకులు ఎండీయూ పంపిణీ చేసే విధానం పరిశీలించడంతో పాటు సరుకుల వివరాలు, నేమ్ బోర్డు వంటి 25 రకాల అంశాలపై అవగాహన ఉండాలని సూచించారు. కమిటీ సభ్యులు, డీలర్ శ్రీనివాసరావు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

మంగళాపురం(చల్లపల్లి): ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సహకారంతో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు అన్నారు. గ్రామంలోని దక్షిణ ఎస్సీ కాలనీ శ్రీనగర్‌లో నివాసితుల విరాళాలతో నూతనంగా ఏర్పాటు చేసిన రబ్బీసు రోడ్డును సర్పంచ్ నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. దశాబ్దాలుగా సమస్యగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధికి గ్రామానికి చెందిన ముక్కు వెంకటేశ్వరరావు, మరికొందరు నివాసితులు కలిసి రూ.2.50 లక్షలు విరాళం ఇచ్చారని తెలిపారు. తనవంతుగా సొంత డబ్బు రూ.50 వేలు కలిపి రబ్బీసు రోడ్డు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

పెడన: 11వ వార్డుకు చెందిన మల్ల కోటయ్య ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయంగా మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను మృతుడు కోటయ్య కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కో–ఆప్షన్ సభ్యులు వీరంకి నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ముత్యాల మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల కేసులో నిందితుడికి రిమాండ్

మోపిదేవి: మండలంలోని బోడగుంట గ్రామంలో వేధింపుల కేసులో నిందితుడికి రిమాండ్ విధించారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మోపిదేవి పంచాయతీ పరిధిలోని బోడగుంట గ్రామానికి చెందిన బిళ్లపాటి హేమ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాంబశివరావు వేధింపుల వల్లనే హేమ ఆత్మహత్య చేసుకుందనే ప్రాథమిక ఆధారాలు ఉన్నందున కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పట్టణాభివృద్ధి దిశగా అడుగులు వేద్దాం

- పెడన కౌన్సిల్ సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ నాగకుమారి
- అజెండాలోని తొమ్మిది అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మంత్రి జోగి రమేష్ కృషితో పట్టణాభివృద్ధికి అడుగులు ముందుకు వేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో శనివారం జరిగింది. చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 9 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పెడన పురపాలక సంఘం పరిధిలో 2008 నుంచి విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్ల ఈపీఎఫ్‌కు సంబంధించి రూ.38,99,475లను తక్షణం చెల్లించకపోతే అరెస్ట్ వారెంట్ జారీ చేస్తామని ఈపీఎఫ్ కమిషనర్ హెచ్చరించారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన బ్యాంకు ఖాతాలన్నిటినీ స్తంభింపజేస్తామని పేర్కొనడంతో కౌన్సిల్ తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. పురపాలక సంఘ ఆదాయ, వనరులు అంతంత మాత్రమే ఉండటం వల్ల ఈ చెల్లింపులు బకాయి పడుతూ వచ్చాయని, ప్రస్తుతం చెల్లించాల్సిన అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు అజెండాలో అంశాన్ని పొందుపరిచారు. మున్సిపల్ పరిపాలనాధికారుల దృష్టిలో పెట్టాలని తెలిపారు. మున్సిపల్ దుకాణం అద్దె పెంపు, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి రూ.99 వేల చెల్లింపులు, తుక్కు సామాను వేలం ద్వారా వచ్చిన ఆదాయం, పైడమ్మలే అవుట్ వద్ద ఆర్చ్ నిర్మాణం, అమృత్ స్కీం 2.0 మంజూరుకు సంబంధించి డీపీఆర్, పారిశుద్ధ్య పనులకు సంబంధించి బ్లీచింగ్, సున్నం కొనుగోలు తదితర అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సీనియర్ కౌన్సిలర్ పిచ్చిక సతీష్ బాబు మాట్లాడుతూ పట్టణానికి మణిమాణిక్యంగా అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పడిందని, అందులో రోగుల ఓపీ కూడా గణనీయంగా పెరిగిందన్నారు. అదీ కాకుండా ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని చాలా మంది సద్వినియోగం చేసుకున్నారని, మరింత మందికి సేవలందించేలా యూపీహెచ్‌సీ ఏర్పడిందన్నారు. అక్కడ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చూడాల్సిందిగా కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్‌లీడర్ భళ్ల గంగయ్య, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, మెట్ల గోపీ, కమిషనర్ మహేంద్ర, కౌన్సిల్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి అంబటిపై దాడి చేయించి మాపై విమర్శలా?

టీడీపీ నేతల తీరుపై ఎమ్మెల్యే సింహాద్రి ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ఖమ్మంలో మంత్రి అంబటి రాంబాబుపై టీడీపీ నాయకులు దాడిచేసి, తీవ్ర దుర్భాషలాడింది చాలక గన్‌మెన్‌లతో తాము దాడి చేయించినట్లు మాట్లాడుతున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబటిపై దాడిని తీవ్రంగా ఖండించారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు కుమారుడు వివాహ నిశ్చితార్థం కోసం మంత్రి రాంబాబు, తాను ఖమ్మం వెళుతుండగా కల్యాణ మండపం సమీపంలో ఒక సామాజిక వర్గానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబటి రాంబాబు కారును అడ్డగించి నాలుగు నెలలు ఆగు నీ అంతుచూస్తాం, నిన్ను చంపేస్తాం అంటూ బెదిరించి దుర్భాషలాడుతుంటే గన్‌మెన్లు వారిని వారించి పంపించి వేశారని చెప్పారు. దీనిపై కొంతమంది టీడీపీ నేతలు గన్‌మెన్‌లతో మేము దాడి చేయించినట్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఒక సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టి కుట్రలకు పాల్పడటం టీడీపీకే చెల్లిందన్నారు. కులాల వారీగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లాక ఒక సామాజిక వర్గం తీవ్ర నైరాశ్యంలో పడిందని చెప్పారు. చంద్రబాబు జైలులో ఉండాలో, బయట ఉండాలో కోర్టులు నిర్ణయిస్తాయని, ఇందులో మా నాయకుల ప్రమేయం కానీ, మా పార్టీ ప్రమేయం కానీ లేద న్నా రు. తెలుగుదేశం పని అయిపోయిందని, అందుకే జనసేనను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందన్నారు. కులాల మధ్యలో తగవులు పెట్టే సంస్కృతిని ఆపాలని టీడీపీ నేతలకు ఎమ్మెల్యే సింహాద్రి హితవు పలికారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీలు చింతలపూడి లక్ష్మీనారాయణ, మోకా బుచ్చిబాబు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల వద్ద రైతుల జాబితాల ప్రదర్శన

మోపిదేవి: మండలంలోని అన్ని ఆర్‌బీకేల వద్ద శనివారం గ్రామ సభలు నిర్వహించి ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేసిన రైతుల జాబితాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి గ్రేషియా మాట్లాడుతూ పంటల ఈ క్రాప్, ఈకేవైసీ ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు నమోదు చేశామన్నారు. వ్యవసాయానికి సంబంధించిన భూముల సర్వే నంబర్లు, పేర్లపై అభ్యంతరాలు ఉంటే ఆయా ఆర్‌బీకేలలో సంప్రదించాలని రైతులకు సూచించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు రావి రాంప్రసాద్, రెడ్రౌతు వెంకటరమణ, పలువురు రైతులు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం అందజేత



మచిలీపట్నంటౌన్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లేడి యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు 50 మందికి యూనిఫాంను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం అందజేశారు. వాసవీక్లబ్ ప్రతినిధి గుప్తా సంస్మరణార్థం యూనిఫాంను అందజేశామని క్లబ్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి, గవర్నర్ మాజేటి రామచంద్రరావు తెలిపారు. యూనిఫాంను క్లబ్ ప్రతినిధులు యెండూరి సురేష్, జంగాల ప్రశాంత్, కొప్పర్తి రవిశంకర్, మాటూరి పూర్ణ, మల్లవోలు వెంకటరాజేష్, కార్తీక్, మహేష్ సమకూర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాకోళపు నరసింహగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మచిలీపట్నంటౌన్: జిల్లా స్థాయి ఖాదీ మహోత్సవంలో భాగంగా శనివారం స్థానిక రుస్తుంబాద పార్కులోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను సమగ్ర శిక్ష ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎం. ఫణిదూర్జటి ప్రారంభించారు. వివిధ కేటగిరీల్లో విజేతల వివరాలను స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయానికి పంపామని ఫణిదూర్జటి తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థులకు ఖాదీ మహోత్సవంలో భాగంగా స్థానిక షార్కీ మెమోరియల్ బాలికల హైస్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. పోటీలను ఎంఈఓ దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో పోటీలు నిర్వహించి విజేతల జాబితాను జిల్లా అధికారులకు పంపామన్నారు.

బోనస్ పంపిణీ

చల్లపల్లి: పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ విస్తృత కృషి చేస్తోందని యూనియన్ జిల్లా డైరెక్టర్ వేమూరి సాయి వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక పాల కేంద్రం ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు 2022–23 ఆర్థిక సంవత్సరం బోనస్ పంపిణీ చేశారు. అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మి ఆధ్వర్యంలో 200 మంది పాడి రైతులకు రూ.2,40,820 బోనస్ అందజేశారు. పాగోలు శివారు మేకావారిపాలెంలో అధ్యక్షుడు మేకా వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో 71 మందికి రూ.1,13,638 బోనస్ అందచేశారు. అత్యధిక పాలు సరఫరా చేసిన రైతులకు బహుమతులు అందజేశారు.

30న 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి'

పెడన: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఈ నెల 30వ తేదీన గూడూరులోని మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిలోని సుమ కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ హాజరవుతారని తెలిపింది. పెడన నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పేర్కొంది.

సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతల పిలుపు

అవనిగడ్డ: నవంబర్ 2వ తేదీన అవనిగడ్డలో నిర్వహించనున్న సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో నాగాయలంక జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు మోకా బుచ్చిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. చట్టసభల్లో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కట్టబెట్టి సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారని చెప్పారు. గతంలో నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలను, నాయకులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీకి బోన్ బ్యాంకుగా ప్రకటించి ఆయా సామాజిక వర్గాలకు రాజకీయ గుర్తింపు తీసుకొచ్చారని వివరించారు. అవనిగడ్డలో జరిగే సామాజిక బస్సు యాత్రకు వేలాదిమంది తరలి రావాలని పిలుపు నిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు నలుకుర్తి రమేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టిన ఈ వర్గాలు వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు చెన్ను రంగారావు, విజయవాడ సిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. ప్రేమ్, నాయకులు పాల్గొన్నారు.